అనుభవించింది. ఈ ఇంట్లోకి వచ్చిందగ్గర నుంచీ మనసు తేటగా వుంది. ఇంటాయన రంగనాధరావు గారు ఎవరితోటి మాట్లాడే రకం కాదు. ఏం మాట్లాడినా ఎక్కువగా ఆయన భార్య సీతమ్మగారితోటే.

సీతమ్మగారు కలివిడిగానే మాట్లాడుతుంది. ఆ మాటలు సూటిగా వుంటాయి.

వాళ్ళతో ఆ యింటి నీడన జీవితం మరీ వాళ్ళ కన్నకూతురి గా కాకపోయినా, మమతున్న అయినవాళ్ళ దగ్గర ఉన్నట్టుంది.

తెల్లారాక ఆ భార్య భర్తా తనతో మోహన్‌ని చూస్తే..... వాళ్ళ ప్రవర్తన ఎలా వుంటుందో?

గొడవ చేసి రభస చెయ్యకపోవచ్చు. కానీ ఇల్లు ఖాళీ చెయ్యమనొచ్చు. అంటే మళ్ళీ ఏ రకం హింసలోకి వెళ్ళాలో?

పోనీ మోహన్‌ని వెళ్ళనిస్తే....

మోహన్‌ని పంపించాలని లేదు. రోజూ అతనితో ఆఫీసులో, రెస్టారెంట్‌లో, బజార్లలో చాలాసేపు కలిసి గడుపుతుంది. కానీ ఇలా దగ్గరగా, ఒకిరికి ఒకరుగా ఇంటి నీడన గడిపే సమయం.... యీ నిండు.... తను ఒంటరిది అన్న ఆలోచనని ఎంతో దూరంగా వుంచే శారీరకానుభవం.... ఏ బరువూ లేనట్టు తేలిగ్గా అనిపించే హాయి.... ఈ సమయం నిజమైన జీవితంలా వుంది.

అయినా పంపటం ఎందుకు? ఈపాటికే మోహన్ అలికిడి ఇంటివాళ్ళకి తెలియకుండా వుంటుందా? తెలిసే వుంటుంది.

తెలిసినా, తెలియకపోయినా.... ఇప్పుడు మోహన్ వెళ్ళిపోతే.... తెల్లారే వరకూ తన పరిస్థితి.... అనుభవించిన హాయి కన్నా, ఒంటరి బతుకన్న బాధ ఎక్కువైతే.... ఇంక ఎక్కువగా ఆలోచనని సాగనివ్వదలచుకోలేదు.

"ఇప్పుడు వెళ్ళద్దు మోహన్.... ఉండిపో...." అంది సుధ స్థిరంగా.

సుధ గొంతులో సందిగ్ధం లేదు. కానీ మోహన్‌కే సందేహంగా వుంది. సందేహం ఉండటమా, వెళ్ళటమా అని కాదు. అసలు మొత్తం విషయం మీద. సుధకి తను చేస్తున్నదేమిటి? ఆమెతో కలిసి గడిపే సమయంలో ఆనందం యిస్తున్నాడు. కానీ సుధ జీవితపు లోటు విషయంలో ఏం చెయ్యలేక పోతున్నాడు. ఆమె జీవితపు స్థాయిని మెరుగు పరచలేకపోతున్నాడు.

అనుకూలంగా లేని పరిస్థితుల ఇబ్బంది తనకీ, సుధకీ కూడా తెలుసు. కానీ ఎంతకాలం ఇలా?

తమిద్దరికీ ఒకరికొకరు కావాలి. ఎప్పుడో ఒక రాత్రో, మరో గంటో సంతోషాన్ని కొలుచుకోటం కాకుండా యధేచ్ఛగా కలిసి బతికే జీవితం కావాలి. ఎలా?

అంతకీ లతకి రకరకాలుగా చెప్పి, ఎన్నో రకాలుగా సూచనలు చేసి చాలాసార్లు ప్రయత్నించాడు. వయసులో పెద్దగా తేడా లేకపోయినా తనకి అక్క అవటం వల్ల మరీ అంత చొరవగా చెప్పలేకపోతున్నాడు.

లత కాంప్లెక్స్ తనకి తెలుసు. ఆమె జీవితాన్ని ఆమే నిర్ణయించుకోవాలి. ముప్ఫై ఆరేళ్ళ వయసులో సంబంధాలు చూసినా పెళ్ళి కుదరటంలేదు. తమ్ముడే తనకి భర్తని చూసిపెట్టాలని అనుకుంటూ ఇంట్లోనే మగ్గిపోకుండా, ఇల్లు దాటే ఆలోచనకి ఆమె ఆస్కారం ఇవ్వాలి. తనకి తను స్వతంత్రంగా నిలదొక్కుకుని, ఆమె యిష్టాల్ని ఆమె నిలబెట్టుకోవాలి. కానీ లతలో ఆ ఆలోచన రావటంలేదు. అంతేకాదు. తమ జీవితాల్లో ఏ మార్పు ఆమెకి యిష్టంలేదు. పెళ్ళి అన్న ఆలోచనకే తప్ప ఉద్యోగం, ఆ తర్వాత స్వతంత్ర

అవునన్నట్టుగా తలూపింది సుధ.

"నాకూ, మీ బాబయ్యగారికి అతన్ని పరిచయం చేస్తే బావుండేదిగా....?" అంది ఆవిడ.

సుధ పరీక్షగా ఆవిడ ముఖంలోకి చూసింది. ఆవిడ ముఖంలోగానీ, చూపులోగానీ, ఏ వ్యంగ్యం కనిపించలేదు. ఎప్పటిలాగే వుంది ఆవిడ.

సుధకి ఆశ్చర్యంగా వుంది. మనసు లోలోపల సంతోషం ఉబుకుతోంది.

పరిస్థితి ఎలా వుంటుందో ఊహించలేకపోయినా, ఇలా వుంటుందని మాత్రం అనుకోలేదు.

"అది కాదు... మోహన్ మా ఆఫీసులో.... నేనూ, మోహన్...." అంటూ ఉద్విగ్నంగా ఏదో చెప్పబోయి తత్తరపడింది సుధ.

"చెపుదువుగాని. నెమ్మదిగా చెపుదువుగాని. కంగారేం లేదు..." అంది సీతమ్మగారు చిరునవ్వుతో.

సుధ మాటలన్నీ ఆగిపోయాయి... 'జీవితానికి ఇలాంటి అవకాశం కూడా వుంటుందా? ఏ వ్యక్తైనా.... కొంచం భిన్నమైన ప్రవర్తనతో మరో మనిషి కలవరాన్ని అంత తేలిగ్గా తుడిచెయ్యగలుగుతారా.... మనుషులు హాయిగా బతకటం యింత తేలికా....'

సుధకి తనకేం జరుగుతోందో తనకే తెలియనట్టుగా వుంది. తను మొత్తంగా కరిగిపోతున్నట్టుగా వుంది.

సీతమ్మగారి నవ్వూ, గొంతు తన ఒంటరి జీవితాన్ని సఖ్యంతో నింపేసినట్టుగా వుంది.

మోహన్‌కి కూడా చెప్పని కొన్ని తన విషయాలు అంతకుముందే.... ఆవిడకి చెప్పుకుంది సుధ. ఇప్పుడు మరీ దగ్గరగా మరిన్ని విషయాలు చెప్పుకుంది.

సుధ చెప్పుకున్నవన్నీ శ్రద్ధగా వింది సీతమ్మగారు. విన్నాక "సుధా.... ఒంటరిగా బ్రతికే ఆడపిల్లని విచ్చలవిడిగా ఉండమనటం నా వుద్దేశం కాదు. నీకు తెలుసుగా మాకు ముగ్గురు ఆడపిల్లలు.... వాళ్ళ జీవితాల్లోనూ రకరకాల ఒడిదుడుకులు వచ్చాయి. కొన్నింటినీ నేనూ ఆయనా సరిగ్గానే సర్దుబాటు చేశాం.... మరికొన్ని వాళ్ళే సర్దుబాటు చేసుకున్నారు.

నైతికం, అనైతికం సరసన అవసరం అన్నది కూడా యీనాటి స్త్రీ జీవితం. నీకు మోహన్ మీద నమ్మకం వుందని అర్థమవుతూనే వుంది. కాలమే కొన్నింటిని చక్కపరుస్తుంది. కానీ అప్పటిదాకా జీవితం మరింత జటిలం కాకుండా నువ్వు తీసుకోగలిగిన జాగ్రత్తలన్నీ తీసుకో.... మా యింట్లో నువ్వు సుఖంగా, ధైర్యంగా, హాయిగానే ఉండాలి. ఇబ్బందిగా కాదు..." అంది ఆవిడ.

సుధ భుజం మీద ఆవిడ చేతి స్పర్శ. ముఖంలో చిరునవ్వు.

అరవై ఆరేళ్ళ సీతమ్మగారి స్త్రీ సౌందర్యంలో సుధ ఒదిగిపోయింది.

• *అన్వేషణ వారపత్రిక, 28-11-1995*

• *'సరికొత్త కథ' కథా సంకలనం - 95*

• *పునర్ముద్రణ*